# ఆకారాలు!

ఆ కటికచీకట్లో వూరికి దూరంగా వొంటరిగావున్న ఆప్రదేశం కేపిటలిస్టు దేశాల మధ్యవున్న రష్యాలా వుంది.

అంతవరకే పోలిక !

మొండిగోడలు—గజిబిజిగా పెరిగిన వృక్షాలతో ఆవరణా—నరాలు జివ్వున లాగే నిశ్శబ్దం——చీకటి పడితే ఆ చాయలకు ఎవ్వరూ పోరు. అటువంటిచోట, ఆ సమయంలో ఆకుల గలగల ధ్వని.

ఎండిపోయిన ఆకులు పాదాలకింద నలుగుతున్న—అప్పడాలు విరుగుతున్న ధ్వని.

బేటరీ లైట్ వెలుతురు, అలా వొక్క-క్షణం నలుదిక్కులా తిరిగింది. వెలిగింది వెలిగినట్లే మూసుకుంది——

మనుష్యుల ఆకారాలు గోడల అంచున కదలుతున్నయ్. అందులో వొక ఆకారం సర్కిల్ది మిగిలినవి పోలీసులవి.

ఆ ఆకారాలు అడుగుల్లో అడుగులు వేసుకుంటూ గవాక్షాన్ని సమీపించినై. ఇక్కడ గవాక్షంఅంటే రెండు అర్థాలేక తలుపేగనక సర్కిల్ ఆకారం నెమ్మదిగా బహుచాకచక్యంగా తలుపు దగ్గర చెవి పెట్టి వింది. ఏమీ వినపడలేదు.

ఈసారి చెవుల్ని కొంచం దూరంగా పెట్టి వింది. లోపలనుంచి గుసగుసలు వినిపించినై.

పెద్ద ఆకారాన్ని చూచి మిగిలిన చిన్న ఆకారాలు—హోదాలో సుమండీ—చెవులు రిక్కించినయ్. అది చూచి పెద్ద ఆకారం ముక్కుమీద వేలువేసుకొని వారించింది.

పెద్ద ఆకారం మళ్ళీ చెవులు తలుపుకు దూరంగా పెట్టి, ఒకసారి తలుపు ఎగాదిగా చూచి, గొంతులోనే గొంతు సవరించుకొని, చూపుడువేలు ముడిచి కణుపుతో తలుపుకొట్టింది.

ఈసారి చెవుల గొడవ లేకుండానే లోపలనుంచి, అటూ ఇటూ గాభరాగా తిరుగుతున్న పాదాల ధ్వని—చప్పుడు—వినిపించింది.

సర్కిల్ ఆకారం ఆపుకో లేకపోయింది. "తలుపు" అని గద్దించింది. వెంటనే చిన్న ఆకారాలన్నీ రిక్కించటం మానేసి "తలుపు" అని గద్దించినయ్.

తలుపు నెమ్మదిగా తెరుచుకుంటూ వుంది. లోపలి వెల్తురు తలుపు సందులోనుంచి ప్రసరించి ఈ ఆకారాలను మానవుల్నిగా మార్చింది.

'రెడీ' అన్నాడు సర్కిల్.

తెరుచుకునే తలుపు మూసుకుపోయింది. అంతా వొక్క సారి కట్టకట్టుకొని తలుపుమీద పడ్డారు. అవి బార్లగా విడిపోయి నయ్. పోలీసు లంతా గజిబిజిగా గది ప్రవేశించారు.

ఆహా ! అయ్యో !!

ఒకమూల వార్తాపత్రికల కట్టలూ—ఒకమూల పుస్తకాల దొంతర్లూ—ఒకపక్క చీట్లపేక ముక్కలూ—ఒకపక్క సిగిరెట్ పీకెలూ. ఇవీ ఆగది రూపరేఖావిలాసాలు.

సర్కిల్ లోపల గదిలోకి వెళ్లే ద్వారం మూసివుంటం చూశాడు. తలుపుతీసిన కుర్రవాణ్ణిచూచి, "పాతాళహోమం?" అన్నాడు

"కాదు. పిశాచనృత్యం," అని జవాబు.

పోలీసులు హఠాత్తుగా తలుపు తెరిచి పిస్తోళ్ళు చేతుల్లో పట్టుకొని—అంతకుముందు కాళ్ళతో పట్టుకున్నారనికాదు— రెండో గదిమధ్యకు దూకారు. గిర్రున మడంమీద తిరిగారు.

"హాన్డ్స్ అప్" అని గర్జించాడు సర్కిల్.

అదొక గది అని రాశాను. అంతకంటే మరో మాట దొరక్క రాశాను. కాని అది గదే! మధ్య వొక డ్రాయరుంది. దానిమీద వెలుగుతూ వెలగని దీపం. దాని పక్కన గ్లోబ్. ఒకమూల ఒకకుర్రవాడు కూచున్నాడు. అతడుమాత్రం పోలీసుల ప్రవేశానికి ముందునుంచీ చేతులు పైకెత్తుకునే

కూర్చున్నాడు. మరోమూల మరో కుర్రవాడు—అతనిచేతులు మాత్రం దించుకునే వున్నయ్. దించుకునేవున్న చేతుల్తో కంగారుగా చేతిలోని వస్తువు కాగితం కిందకు తోశాడు.

పోలీసులు కాలాంతకులు. ఆవులింపించిపేగులెక్క పెడతారు. ప్రస్తుతం ఆకుర్రవాని చేతివ్రేళ్లెక్క పెట్టారు. "హాన్డ్స్ అప్" అని అరిచాడు సర్కిల్. ఆకుర్రవాడు కూడా కిక్కురుమనకుండా చేతులు పైకెత్తాడు. నోట్లోసిగరెట్ పీకమాత్రంఅలానే వుంది. దమ్ములాగుతూనేవున్నాడు, పొగ వొదల్తూనేవున్నాడు. "ఆకాగితం కింద ఏం పెట్టావ్?" అడిగాడు సర్కిల్.

కుర్రవాడు పొగతో జవాబు చెప్పాడు. "చేతులు పెట్టి కాల్చుకున్నా." మరో దమ్ములాగి, "చేతులు దింపనివ్వండి తీసి చూపిస్తాను," అన్నాడు.

ఒక పోలీసు సర్కిల్ చెవిలో భయం వూదాడు. ముందుకు అడుగువేసిన సర్కిల్ ఆగిపోయి, పోలీసులను ఆజ్ఞాపించాడు— "ఆ కాగితం కింద ఏమిటో చూడండి."

వాళ్ళుదిరిపోయారు—పాపం! వాళ్ళవీ ప్రాణాలే! వాళ్లవీ పోలీసు హృదయాలే గద! కాని అందులో వొకడికి ప్రాణంకంటే పొట్టతీపు. వాడు వొణుకుతూ వొణుకుతూ వీలయినంత దూరంగా వుండి, కాగితం కొన పట్టుకొని పైకెత్తాడు.

"అమ్మో!" అని కేకవేసి కళ్ళుమూసుకొని చతికిల

బడ్డాడు—కూర్చున్నవాణ్ణి కుక్కకూడా కరవదు. ఇక బాం బెందుకు పేలుతుంది?

సర్కిల్ కాగితంకింద వున్న పొట్లాంచూచి గజగజ లాడాడు. సూటిగా గుండెమీదే పేలిందనుకున్నాడు.

తీరా అందరూ కళ్లుపెట్టుకొని చూచేటప్పటికి అది పంచ దార బిళ్లల పొట్లాం అయింది.

సర్కిల్‌కి కోపం వచ్చింది. "ఈ ఇల్లంతా సోదా చెయ్యాలి" అన్నాడు.

"సోదా చేస్తే మీ కవమానం. చెయ్యకపోతే మా కవ మానం. అలాగే చెయ్యాలి," అన్నాడు మొదట్నించీ చేతులు పైకెత్తు కూచున్న కుర్రవాడు.

సర్కిల్ వెంటనే ఆజ్ఞాపించాడు. ఒక పోలీసు, కుర్రవాళ్లని సోదా చేశాడు:—ఒకరి జేబులో వార్తాపత్రికల కటింగులు దొరికాయి. ఒకరిజేబులో నిప్పుల పుల్లలూ చిల్లా దొరికాయి. మరొకరి జేబులో థర్మామీటర్ దొరికింది.

ఈలోగా సర్కిల్ వూరుకుంటాడా? గదంతా నెతికి అల మర తెరిచాడు. అందులో మూలగా కనబడీకనబడకుండా, ఒక సీసా వుంది. దాన్నిండా ఏదో ద్రావకం.

"ఇదేమిటి?" సర్కిల్ జబర్దస్తీగా కుర్రవాళ్లని అడిగాడు.

సిగరెట్ తాగే కుర్రవాడు చెప్పాడు—"సీసా"

"లోపల్ది?"

"ద్రావకం"

"ఏం ద్రావకం?" మీదకు మీదకు వెళ్తూ రౌద్రంగా అడిగాడు. కుర్రవాళ్ళు బెదిరారు. వొకరిమొహాలు వొకరు చూచుకున్నారు.

"చెప్పండి" గద్దించాడు సర్కిల్.

తలుపు తీసిన కుర్రవాడు చెప్పాడు-"మాకేం తెలుస్తుంది! మేమేం డాక్టర్లమా?"

"అదే తెలుస్తుంది. ఇప్పుడు తెలియదు. రేపు తెలుస్తుంది. కపడ్దార్..." అన్నాడు గడ్డాంపోలీసు.

సర్కిల్ సీసాను గుడ్డకు చుట్టి భద్రంగా జేబులో పెట్టుకున్నాడు. ఇంతలో పోలీసులు రెండు ఎర్ర అట్టల పుస్తకాలు పట్టుకొచ్చారు. అవన్నీ తీసుకొని కోరచూపులు చూస్తూ పోలీసులు నిష్క్రమించారు, ఈ మానవులు మళ్ళీ గదిలో నుంచి బయటకు అడుగుపెట్టగానే ఆకారాలుగా తయారయ్యారు.

కుర్రవాళ్ళంతా విరగబడి నవ్వుకున్నారు. చేతులు పైకెత్తుకొని కూర్చున్న కుర్రవాడు—ఇప్పుడు దించేశాడు—తలుపు తీసిన కుర్రవాణ్ణి చూచి, "మళ్లీ డబ్బొచ్చేదాకా నీకు కాడ్లివర్ ఆయిల్ లేదు," అన్నాడు.

"మళ్లీ డబ్బొచ్చేదాకా నాకు గుండెజబ్బు వుండదు—" అన్నాడు ఆ కుర్రవాడు.

అంతా నవ్వుకున్నారు.

వెంటనే గ్లోబ్ చుట్టూ మూగారు. వెంటనేబాహ్యప్రపంచాన్ని మరిచిపోయి తర్కంలో పడ్డారు—రష్యా—మధ్యధరాసముద్రం—ఇటలీ — జర్మనీ — యూరప్‌లో సెకండ్ ఫ్రంట్ —ఇండియా—ప్రజాయుద్ధం.